
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
బుధవారం
10, జూన్, 2026



# మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవు





**- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్,**

**- డ్రైవ్ కేసుల్లో 38 మందికి జైలు, రూ.2 వేల జరిమానా**

**సంగారెడ్డి టౌన్ జూన్ 09 (జనంసాక్షి):** మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి 2-5 రోజుల వరకు జైలు శిక్ష. ఈ సంవత్సరం ఇప్పటి వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 38 మందికి జైలు, రూ. 2 వేల జరిమానా విధింపు.

ఒక్క క్షణం అజాగ్రత్త జీవితకాలం విషాదంగా మారవచ్చు. - జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్,

సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లా ప్రజల సురక్షిత ప్రయాణం కోసం జిల్లా పోలీసు శాఖ వివిధ రకాల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ, రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తోందని తెలిపారు. వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి సురక్షిత ప్రయాణం చేయాలని ఎస్పీ సూచించారు.

వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలను నడపరాదని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ఇటువంటి చర్యల వల్ల అమాయక ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. చిన్న నిర్లక్ష్యం కూడా నిండు ప్రాణాలను బలిగొంటుందని హెచ్చరించారు. మద్యం సేవించి రోడ్డుపైకి వచ్చే వారిపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడే వారికి జరిమానాలతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని స్పష్టం చేశారు.

ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిలో 38 మందికి 2 నుండి 5 రోజుల వరకు జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించడం జరిగిందన్నారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మద్యం మత్తులో వాహనాన్ని నియంత్రించే సామర్థ్యం తగ్గుతుందని అన్నారు.

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. వాహనదారులు తమ కుటుంబ సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకొని మద్యం సేవించిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపవద్దని, అవసరమైతే ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యాలను వినియోగించాలని జిల్లా ఎస్పీ సూచించారు.

# చేప ప్రసాదానికి అనూహ్య స్పందన

**- రాత్రి 12 వరకు బారులు తీరిన ప్రజలు**

**- సుమారు 5 వేల మంది చేప ప్రసాదం స్వీకరణ**

**- అన్ని ఏర్పాట్లు చేసిన ఆడెం కుటుంబీకులు**







**సంగారెడ్డి, జూన్ 09 (జనంసాక్షి):** మృగశిరకార్తె పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని నిజాంపూర్ గ్రామంలో ఆడెం కుటుంబీకులు పంపిణీ చేసిన చేప ప్రసాదానికి అన్యూహ స్పందన లభించింది. సోమవారం గ్రామంలోని లోపలి కోట హనుమాన్ మందిరం వద్ద పూజా కార్యక్రమాల అనంతరం రాత్రి ఎనిమిది గంటలకు ఉచిత చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. గంట ముందు నుంచే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రోగుల బంధువులు చేప ప్రసాదం కోసం బారులు తీరారు. నిర్వాహకులు ఎలాంటి ఇబ్బంది లేకుండా రాత్రి 12 గంటల వరకు చేప ప్రసాదం అందజేశారు.

మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి రోగులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. సుమారు 5 వేలమంది చేప ప్రసాదం స్వీకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆడం మనోహర్, ఆడం రవీందర్ మాట్లాడుతూ... మృగశిర కార్తె పురస్కరించుకొని ప్రతి సంవత్సరం సదాశివపేట మండలంలోని నిజాంపూర్ గ్రామంలో ఆస్తమా, ఉబ్బసం, దగ్గు, ఎలర్జీ తదితర వ్యాధుల నివారణ కోసం చేప ప్రసాదం ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. చేప ప్రసాదానికి అనూహ్య స్పందన లభించిందన్నారు. నిజాంపూర్‌లో చేప ప్రసాదం వాడిన కొంత మందిని ప్రశ్నిస్తే.. గత ఐదు ఆరు సంవత్సరాలుగా చేప ప్రసాదం వాడుతున్నామని చేపమందు వాడిన తర్వాత తమకున్న ఇబ్బందులు పూర్తిగా నయమవుతున్నాయని వారు తెలిపారు. మాతోపాటు మా బంధువులకు కూడా చేప ప్రసాదం వాడుకోవాలని సలహా ఇచ్చినట్లు వారు తెలిపారు. చేప ప్రసాదం వాడడం వల్ల ఉబ్బసం, ఆస్తమా ఎలర్జీ ఇలాంటి వ్యాధులు తగ్గిపోయాయని తెలిపారు.

**చేప ప్రసాదం వేసుకున్న వారికి నిబంధనలు...**

చేప ప్రసాదం వేసుకున్న వారికి ఇచ్చే మందు మాత్రలు ఏడు రోజులు తప్పకుండా వేసుకోవాలి, నూనె లేకుండ అల్లం, వెల్లుల్లి , కారం, కందిపప్పు, పెసరపప్పు మాత్రమే తీసుకోవాల్సిన ఉంటుంది, 3 సంవత్సరాల వరకు పుంటి కూర, సొరకాయ, కోడి మాంసం, చేపలు, బచ్చల కూర, చింతకాయ ,పచ్చిమిర్చి, సేమ్యా లాంటి వస్తువులు తినకూడదు,6 నెలల వరకు నంజు వస్తువులైన జర్ద, పొగాకు, సిగరెట్టు వాడకూడదు, 3 సంవత్సరాల వరకు ప్రతి సంవత్సరం చేప మందు తప్పకుండా వేసుకుంటే వంద శాతం సమస్యలు దూరమవుతాయని నిర్వాహకులు మనోహర్, రవి తెలిపారు.

# చెట్లు నాటి సంరక్షించాలి

**- రేంజ్ అధికారి కమాలుద్దీన్**



**నారాయణపేట, జూన్ 9 (జనం సాక్షి):** చెట్లు ప్రగతి పదానికి మెట్లని ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటి సంరక్షించాలని అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ కమాలుద్దీన్ తెలిపారు. మంగళవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఎక్లాస్పూర్ గ్రామంలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉప సర్పంచ్ పంచాయితీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమలుద్దీన్ మాట్లాడుతూ నేడు మనం నాటిన చెట్లే రేపు మహా వృక్షాలుగా మారి మనకు జంతువులకు పక్షులకు నీడనిస్తాయని తెలిపారు. ఎలాంటి శుభకార్యాలు జరిగిన ఒక మొక్క నాటి గుర్తు చేసుకోవాలన్నారు.

# సింగిల్ విండో డైరెక్టర్ నరసింహ్మా యాదవ్ గారిని పరామర్శించిన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

**- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు**



**శ్రీరంగాపూర్, జూన్ 9 (జనంసాక్షి):** శ్రీరంగాపురం మండలం జానంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సింగిల్ విండో డైరెక్టర్ నరసింహ యాదవ్ ప్రమాదవశాత్తు బైక్ ఆక్సిడెంట్ లో కాలు విరిగిపోవడం కావడం జరిగింది. వారు పెబ్బేరు పట్టణ కేంద్రంలోని సరోజిని హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లేల చిన్నారెడ్డి నరసింహ యాదవ్ గారిని పరామర్శించడం జరిగింది. హాస్పిటల్ డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి గారితో వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీయగా డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని మరికొద్ది రోజుల్లో సాధారణ స్థితికి వస్తారని తెలిపారు. వారికి అవసరమైన మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ జిల్లేల చిన్నారెడ్డి సూచించారు. ఇట్టి కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి నందిమల్ల యాదయ్య డిసిసి మాజీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్. రాంపురం సహదేవుడు ఎండి బాబా సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాస్ గౌడ్ పాతపల్లి చంద్రశేఖర్ వెంకటస్వామి నాయుడు సర్పంచ్ ఈ రాములు నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు జబ్బ, గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు



**మల్దకల్, జూన్ 9 (జనంసాక్షి):** మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామంలో ఉచిత గొంతు, జబ్బవాపు వ్యాధి నివారణ టీకాలు శిబిరం గ్రామ సర్పంచ్ శిరీష రాజశేఖర్ రెడ్డి,డాక్టర్ ఉషతో కలిసి మంగళవారం ప్రారంభించారు. పాల్వాయి పశు వైద్య అధికారిని డా. ఉషమాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు ప్రధానంగా వచ్చేవ్యాధులు గేదెలలో గొంతువాపు గోజాతి పశువులలో జబ్బవాపు, గొంతువాపు వ్యాధి ఎక్కువగా గేదెలలో వస్తుందని,ఈ వ్యాధిని గురకవ్యాధి అని కూడా అంటారు,గొంతువాపు వ్యాధి లక్షణాలు 104 -106 జ్వరం,కళ్ళు ఎర్రబడి నీరు కారటం, గొంతు పైభాగాన మెడ కింద వాపు, శ్వాస పీల్చేటప్పుడు పశువులు ఆయాసపడతాయి. జబ్బావాపు వ్యాధి లక్షణాలు బలంగా ఆరోగ్యంగా ఉన్న గోజాతి పశువులలో ఎక్కువగా వస్తుందని జబ్బా, తొడ కండరాల పైన వాపు కనబడుతుందని, పశుపోషకులుముందస్తు జాగ్రత్తగా వ్యాధి నివారణ టీకాలు వేయించాలి అన్నారు.సర్పంచ్ శిరీష రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై పశు యాజమానూలు అప్రమత్తంగా ఉండి రోగాల భారీ నుండి తమ పశువులను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 52 గోజాతి పశువులు,20 గేదెలలో టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది మధు,సర్పంచ్ శిరీష రాజశేఖర్ రెడ్డి,ఉపసర్పంచ్ లక్ష్మీనరసింహా,ఓంశంకర్ ఉల్వ నర్సింహా,కుర్వ నర్సింహా, శ్రీశైలం, రమేష్,రంగస్వామి గ్రామస్తులు,పశు పోషకలు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు క్రీడా సామాగ్రి అందజేత



**కోహెడ జూన్ 09 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ సమావేశ మందిరంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశానుసారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులకు, క్రీడా సామాగ్రి ని స్థానిక నాయకులు పంపిణీ చేశారు. పంపిణీ అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లోని యువత క్రీడల్లో రానించటం కొరకు, ముఖ్యంగా శారీరక, మానసిక ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండటం కొరకు క్రీడాసామాగ్రి పంపిణీ చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మంద ధర్మయ్య, మార్కెట్ చైర్ పర్సన్ బోయిని నిర్మల - జయరాజు, వైస్ చైర్మన్, స్థానిక సర్పంచ్ బందెల సుజాత, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ డైరెక్టర్లు, గ్రామాల సర్పంచులు, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, యూత్ కాంగ్రెస్ నాయకులు , ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ అయిన గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఘనంగా సన్మానం




**నర్సాపూర్, జూన్ 9 (జనంసాక్షి):** నర్సాపూర్ మండలం అచ్చంపేట గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా పనిచేసిన శ్రీనివాస్ మంగళవారం బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నీరుడి తుల్చమ్మ బిక్షపతి ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను శాలువాలతో పూలదండలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నీరుడి తుల్చమ్మ బిక్షపతి మాట్లాడుతూ గత 7సంవత్సరాలుగా అచ్చంపేట గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన శ్రీనివాస్ గ్రామంలోని సమస్యల పట్ల స్పందించి వారి సమస్యలు పరిష్కరించేవాడని అన్నారు. గ్రామస్తులతో కలిసిమెలిసి సామరస్యంగా సమస్యలు తెలుసుకుని వాటిని అధికారులకు విన్నవించి పరిష్కరించే వాళ్లని ఇన్ని సంవత్సరాలుగా గ్రామంలో సేవలు అందించిన శ్రీనివాస్ మంచి పేరు తెచ్చుకున్నారని ఆయన చేసిన సేవలు కొనియాడారు. అచ్చంపేట గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన శ్రీనివాస్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో నూతన కార్యదర్శిగా శ్రావణి సింధూజ పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన కార్యదర్శి శ్రీనివాస్ కు వీడ్కోలు పలకగా నూతన గ్రామ కార్యదర్శి శ్రావణి సింధుజ కు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఉపా సర్పంచ్ నవీన్, వార్డు సభ్యులు ఆంజనేయులు, ప్రవీణ్, కృష్ణ,నరసమ్మ, లక్ష్మి, అంగన్వాడీ టీచర్. జ్యోతి.గ్రామ పెద్దలు గోవర్ధన్. ఆంజనేయులు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఘన సన్మానం...



**మెదక్, జూన్ 9 (జనంసాక్షి):** మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండల పరిధిలోని జిల్లా వ్యాప్తంగా 100 శాతం ఉత్తీర్ణత సాధించిన 91 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, సన్మాన కార్యక్రమంలో భాగంగా మంగళవారం రోజు మెదక్ జిల్లా కలెక్టర్ ఆడిటోరియంలో మెదక్ జిల్లా విద్యాధికారి రాజు అధ్యక్షతన జరిగిన అభినందన కార్యక్రమంలో పీఎంశ్రీ జడ్పీహెచ్ కూచన్‌పల్లి పాఠశాల 100% ఉత్తీర్ణత సాధించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాచారం మధుమోహన్‌ని మెదక్ జిల్లా పాలానాదికారి ప్రతిమాసింగ్ ఘనంగా సన్మానించారు. అదే విధముగా గత సంవత్సరం పదవ తరగతి వార్షిక పరీక్షల్లో. 560 ఆ పై మార్కులు సాధించిన ఉత్తమ ప్రతిభావంతులైన మండల పరిధిలోని ఇద్దరి విద్యార్థులకు సన్మాన సత్కార ప్రశంసలలో భాగంగా హవేలీ ఘనపూర్ మండలం పరిధిలోని పిఎంశ్రీ జడ్పీహెచ్ఎస్ కూచన్ పల్లి విద్యార్థి దివ్య, జడ్పిహెచ్ఎస్ ఘనపూర్ విద్యార్థిని తేజస్వినిలను జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ప్రశంసా పత్రంతో అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు శివరాజ్, మల్లారెడ్డి, దేవ్లా వినోద్ పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డకు కళ్యాణలక్ష్మి వరం



**పుల్కల్, జూన్ 9 (జనంసాక్షి):** పేదింటి ఆడబిడ్డ పెళ్లికి కళ్యాణ లక్ష్మి వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుర్గా రెడ్డి అన్నారు.మంగళవారం మండల పరిధిలోని వివిధ గ్రామా ల చెందిన 88 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల ను తాహసిల్దార్ కృష్ణతో కలిసి రైతు వేదికలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా పేదింటి ఆడబిడ్డలకు ఎంతో ఆసరా అయిందన్నారు.అలాగే అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన వివిధ గ్రామాల వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కూడా అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి ఉపాధ్యక్షులు అంజయ్య, లక్ష్మారెడ్డి, గోవర్ధన్, బోయిని శ్రీనివాస్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్, బస్వాపూర్ సర్పంచ్ భూమిరెడ్డి, సింగూర్ సర్పంచ్ శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచులు పుల్కల్ వార్డు సభ్యులు మంగలి రాజు, నరేందర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ షాపులో చోరీ యత్నం

**మల్దకల్ జూన్ 9(జనంసాక్షి):** మండల కేంద్రంలో ఒక ఎలక్ట్రికల్ షాపులో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఒకరు లోపలికి చొరబడ్డారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు షాపులోని సిసిటివి కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మల్దకల్ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి సంబంధించిన సిసిటివి వీడియో ఫుటేజీలను ఫోటోలను మల్దకల్ పోలీసులు విడుదల చేశారు. విడుదల చేసిన వీడియోఫోటోల ఆధారంగా సదరు నిందితుడిని ఎవరైనా గుర్తిస్తే,అతని గురించిన ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే 9866370521, 8712670295 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని మల్దకల్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఐశ్రీహరి ప్రజలను కోరారు.

## ఆయిల్ ఫామ్ సాగుతో లాభం



**పాపన్నపేట, జూన్ 9 (జనంసాక్షి):** ఆయిల్ ఫామ్ పంటలతో రైతులకు లాభదాయకమని వ్యవసాయ విస్తరణాధికారి నర్సింలు తెలిపారు. మంగళవారం గాంధారిపల్లిలో నాగరాజు వ్యవసాయ భూమిలో 3.5 ఎకరాల విస్తీర్ణంలో మొక్కలను నాటారు. సబ్సిడీతో ఈ పంట మొక్కలు అందుబాటులో ఉంటాయన్నారు. నిర్వాహణ పద్ధతులను హార్టికల్చర్, సంబంధిత శాఖాధికారులు కృష్ణరావు, జాన్సన్, భరత్ కుమార్ రైతులకు వివరించారు. సర్పంచ్ సిద్ధిరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

## మొగుడంపల్లిలో మహిళా సంఘాల బస్సు ప్రారంభం



**మొగుడంపల్లి, జూన్9 (జనంసాక్షి):** మండలంలోని మహిళా సంఘాలు ఇందిరా మహిళా శక్తి పథకం కింద రూ.36 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన బస్సును ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో ఏపీఎం టిక్య నాయక్, సర్పంచ్ రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాక్స్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, మహిళా సంఘాల ఆర్థిక సాధికారతకు ఈ బస్సు దోహదపడుతుందని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవడంతో పాటు సంఘాల ఆదాయ వృద్ధికి కూడా ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ప్రైమరీ పాఠశాలలో పోస్టుల భర్తీ

**- గుండుమాల్ జూన్ 9 (జనంసాక్షి):** గుండుమాల్ మండలంలోని గుండుమాల్, బోగారం ప్రీప్రైమరి పాఠశాలలో ఉపాధ్యాయురాలు, అయాలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించిన ఎంఈఓ శేఖర్ రెడ్డి, గుండుమాల్ ప్రీప్రైమరీ ఉపాధ్యాయురాలు ఒక్క పోస్టుకు 11 దరఖాస్తులు, ఒక్క ఆయా పోస్టుకు రెండు దరఖాస్తులు వచ్చాయని, అలాగే భోగారంలోని ఒక్క పోస్టుకు 6 దరఖాస్తులు, ఒక్క ఆయా పోస్టుకు మూడు దరఖాస్తులు వచ్చాయని ఎం ఈ ఓ శేఖర్ రెడ్డి తెలిపారు.ఉపాధ్యాయురాలు పోస్టులకు ఇంటర్‌తో పాటు డిఈడి లేదా బిఈడి అర్హత కలిగిన వారికే ప్రాధాన్యత ఉంటుందని,ఆయా పోస్టులకు 7 వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారికే



ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి నారాయణపేట జిల్లా డి ఈ ఓ ఆఫీసుకు పంపించాము అని తెలిపారు.

# అసలు బంగారం అమ్మేసి-దోపిడీ కథ అల్లిన మహిళ

**- పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చిన అసలు నిజాలు**
**- మహిళపై కేసు**
**- ఎస్ఐ తోట తిరుపతి**

**బెజ్జంకి,జూన్09,(జనంసాక్షి):** మండలంలోని వడ్లూర్ గ్రామానికి చెందిన బోనాల పద్మ (56) తన ఇంటిలోకి ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి కత్తులతో బెదిరించి బంగారు ఆభరణాలు,రూ.30 వేల నగదును దోచుకెళ్లినట్లు గ్రామ సర్పంచ్ ద్వారా పోలీసులకు సమాచారం అందజేసింది. సమాచారం అందుకున్న వెంటనే బెజ్జంకి ఎస్ఐ తోట తిరుపతి, సిద్దిపేట రూరల్ సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో క్లూస్ టీమ్‌తో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. విచారణలో బాధితురాలు తెలిపిన వివరాల్లో పలు విరుద్ధతలు గుర్తించడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు నిర్వహించారు. దర్యాప్తులో భాగంగా బోనాల పద్మ గతంలో తన అసలు బంగారు ఆభరణాలను విక్రయించి వాటి స్థానంలో నకిలీ ఆభరణాలు ఉంచినట్లు తేలింది. ఈ విషయం తన భర్తకు తెలియకుండా ఉండేందుకు దోపిడీ జరిగినట్లు తప్పుడు కథనం సృష్టించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు విచారణలో బయటపడింది. తనకు ఉన్న స్వల్ప గాయాలను కూడా దోపిడీ జరిగినట్లు చూపించే ప్రయత్నం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసులను తప్పుదారి పట్టించే ఉద్దేశంతో తప్పుడు సమాచారం ఇచ్చినందుకు బోనాల పద్మపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వ్యక్తిగత కారణాలతో తప్పుడు ఫిర్యాదులు చేసి పోలీసు వ్యవస్థను మభ్యపెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తోట తిరుపతి హెచ్చరించారు.



# మహిళా వారోత్సవాలకు తరలివెళ్లిన మండల సమాఖ్య సభ్యురాలు

**- మహిళా సమాఖ్య సభ్యురాలకు నూతన ఆర్టీసీ బస్సు అందజేత**

**జోగిపేట, జూన్9 (జనంసాక్షి):** సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్లో మంగళవారం జరిగిన మహిళా వారోత్సవాలకు అందోల్ మండల మహిళా సమాఖ్య సభ్యురాలు పెద్ద ఎత్తున ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో తరలివెళ్లారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన మహిళా శక్తి పథకంలో మహిళ సంఘాల యజమాన్యంలో రాష్ట్ర స్థాయిలో 553 నూతన ఆర్టీసీ బస్సులను సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆయా సమాఖ్య సంఘాల సభ్యురాలకు నూతన బస్సులను అందించారు. ఇందులో భాగంగానే అందోల్ మహిళా సమాఖ్య సంఘానికి టీజీ 15 జెడ్ 0125 నెంబర్ గల నూతన బస్సును మంత్రి సీతక్క సమక్షంలో సీఎం అందించారు. మహిళ సమాఖ్యకు అందించిన బస్సును ఆర్టీసీ సంస్థకు అందోల్ మహిళా సమాఖ్య సభ్యురాలు అద్దెకు ఇవ్వనున్నారు. కార్యక్రమానికి తరలివెళ్లిన వారిలో అందోల్ ఎంపీడీవో రాజేష్ కుమార్, మండల విద్యాధికారి బి.కృష్ణ, ఏపీఎం దేవేందర్, సీసీలు, వివోఏలు, సంఘ సభ్యురాలు తరలివెళ్లారు.



# పాఠశాల కోసం ఆర్థిక సహాయం చేసిన ఎన్ఆర్ఐ

**- డా.పెడుతల బాలమణి ప్రతాపరెడ్డి**

**చేర్యాల, జూన్ 09 (జనంసాక్షి):** చేర్యాల మండలం ముస్త్యాల గ్రామ జడ్.పి. హెచ్.ఎస్ పాఠశాల శాశ్వత నిధిదాత ఎన్ఆర్ఐ డా.పెడుతల బాలమని ప్రతాపరెడ్డి సుమారు 6 లక్షల రూపాయలతో పాఠశాలలోని ప్రార్థన స్థలంలో సీసీ రోడ్డు నిర్మాణం వారి బావమరిది మాజీ సర్పంచ్ పెడుతల ఎల్లారెడ్డి చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ముస్త్యాల జడ్పీఎస్ హెచ్ పాఠశాల కోసం ఎన్ఆర్ఐ దంపతులు డా.పెడుతల బాలమని ప్రతాపరెడ్డి ఇప్పటివరకు ఎన్నో లక్షల ఖర్చుచేసి వారు చదువుకున్న పాఠశాల అభివృద్ధి కొరకు నిరంతరం సహాయం చేస్తూనే ఉన్నారు. పాఠశాలకు ఏ అవసరం ఉన్న ముందుకు వచ్చి విద్యార్థుల భవిష్యత్తు కోసం సహాయమందిస్తున్న దంపతులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ మిల్లాపురం రజిత వరేష్, ఉప సర్పంచ్ బైకని కమలాకర్, వార్డు సభ్యులు చింతల విజయ్‌కుమార్, మీస రవితేజ, బండారి సతీష్, మర్మముల పూజా కిషన్, పంచాయతీ కార్యదర్శి. బి. నరేష్, గ్రామ పుర ప్రముఖులు బోలుగం సత్యనారాయణ, ఈరి రాజాలింగం, పిట్టల రాజు, పి.మల్లయ్య, శివాజీ, హరిబాబు, రామచంద్ర రావు, బండోజు భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ పాలనలోనే మహిళా సాధికారత సాధ్యం

**- సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్**

**వెల్దండ, మే 09 (జనంసాక్షి) :** మహిళా సాధికారతే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసిందని సర్పంచ్ మట్ట యాదమ్మకు వెంకటయ్య గౌడ్ అన్నారు.ప్రతిష్టాత్మకంగా తెచ్చిన ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా వెల్దండ మండల కేంద్రం నుంచి మంగళవారం మహిళా సంఘాల లు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌ల్లో 553 బస్సులను మహిళా సంఘాలకు ముఖ్యమంత్రి రేవంత్ చేతుల మీదుగా పంపిణీ చేసే కార్యక్రమానికి బయలు దేరారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.దేశంలోనే మహిళా బస్సుల పథకం అతిపెద్ద స్థాయిలో అమలవుతున్నట్లు చెప్పారు. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాల్లో భాగంగా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని... అందులో భాగంగా వడ్డీ లేని రుణాలు, స్త్రీ నిధి, క్యాంటీన్లు, పెట్రోల్ బంకులతో మహిళలకు చేయూతను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తాలూకా కిసాన్ సెల్ అధ్యక్షుడు పర్వత్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరికిషన్ నాయక్, మాజీ మండల అధ్యక్షుడు మోతీలాల్ నాయక్ , కూన పాండు, మహిళా సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.



# అంగన్వాడీ కేంద్రంలో ఆరోగ్యలక్ష్మి కమిటీ సమావేశం

**కోహెడ, జూన్ 09 (జనంసాక్షి):** మండలంలోని శ్రీ రాములపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఆరోగ్య లక్ష్మి కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, ఆరోగ్య సేవలు, పరిశుభ్రత అలాగే సంక్షేమ కార్యక్రమాల అమలుపై చర్చించారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా అందిస్తున్న ఆరోగ్య లక్ష్మి పథకం ప్రయోజనాలు ప్రతి అర్హులైన లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్ పోలు శ్రీనివాస్ సూచించారు. గర్భిణీలు, బాలింతలు పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం, వైద్య పరీక్షలు చేయించుకోవడం అలాగే పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధవహించాలని అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రంలో పరిశుభ్రత, ఆహార నాణ్యత, లబ్ధిదారుల హాజరు, ఇతర సమస్యలపై చర్చించి తగిన సూచనలు, నిర్ణయాలు తీసుకున్నారు. గ్రామంలోని తల్లులు, కమిటీ సభ్యులు, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి తల్లి-శిశు ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరచాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి 1, 2వ కేంద్రాల కార్యకర్తలు వడ్డేపల్లి రజిత,మరాటి విజయనిర్మల, గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వరూప, ఆశా కార్యకర్తలు ఎసిరెడ్డి సుజాత,లలిత, కమిటీ సభ్యులు, పిల్లల తల్లితండ్రులు పాల్గొన్నారు.



# తల్పునూర్ గ్రామాన్ని జిల్లా మార్పు చేయుటకు దీక్ష అనుమతి కొరకు వినతి పత్రం




**రేవల్లి, జూన్ 09 (జనంసాక్షి):** రేవల్లి మండలంలోని తల్పునూర్ గ్రామాన్ని వనపర్తి జిల్లా నుండి నాగర్ కర్నూల్ జిల్లాలో విలీనం చేయుట కొరకై మండలంలో గల తల్పునూర్ బస్టాండ్ ఆవరణలో శాంతియుత నిరాహార దీక్ష చేయుట కొరకు టెంటు ఏర్పాటు చేయుట కొరకై అనుమతి ఇవ్వాలని గ్రామానికి చెందిన పెద్దలు, యువకులు స్థానిక రేవల్లి మండల ఎస్సై రజితకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై రజిత మాట్లాడుతూ గ్రామంలో శాంతియుత నిరాహార దీక్ష చేయుట కొరకై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆ తర్వాత అనుమతిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్తం రెడ్డి, తెప్ప సురేష్, ఎల్కాల లక్ష్మయ్య, పిట్టల బాల పీర్, అల్తాఫ్, గుబ్బల రాములు, బోడ రాములు, కేతపల్లి రాజు, వడ్డేమాన్ భీముడు, కంపిల్ల నరసింహ పాల్గొన్నారు.

# వరి ధాన్యాన్ని కొనుగోలు చేయించి రైతన్న కష్టాలను తొలగించాలి

**- పెట్రోల్ డబ్బాలతో వచ్చిన రైతులు**

**కొల్చారం, జూన్ 9 (జనంసాక్షి):** వరి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలనీ కొల్చారం తాసిల్దార్ కార్యాలయంలో ఇక మాకు చావే దిక్కు అంటూ పెట్రోల్ డబ్బాలతో రైతులు ఆందోళన చేపట్టారు. కొల్చారం మండల పరిధిలోని సంగయ్య పేట వరి ధాన్యం కొనుగోలు కేంద్రం నుండి కౌడిపల్లి మండలం శ్రీనివాస రైస్ మిల్ కు లారీ ద్వారా తరలించారు. 15 రోజులు అవుతున్న కాళీ కాకపోవటంతో మంగళవారం సంగయ్య పేట గ్రామానికి చెందిన యాదయ్య అనే రైతు కొనుగోలు వెంటనే చేపట్టకపోతే తమకు ఆత్మహత్య శరణ్యమని రెండు పెట్రోల్ డబ్బాలు తీసుకువచ్చి తాసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ శ్రీనివాసాచారి తో తన బాధను చెప్పుకున్నారు. సొసైటీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి సైతం కొనుగోలు వెంటనే చేపట్టకపోతే తమ రైతులకు చావేదికంటూ అగ్రహం వ్యక్తం చేశారు.

గ్రామ సర్పంచ్ కాంతమ్మ ప్రభాకర్ వరి ధాన్యం వెంటనే కొనుగోలు చేపట్టాలని ఆందోళన వ్యక్తం చేయడంతో తాసిల్దార్ శ్రీనివాస్ చారి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేపడతామని బుధవారం సాయంత్రం లోపు లారీలు ఖాళీ అయ్యేలా ప్రయత్నం చేస్తాననీ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.



# జహీరాబాద్ బుల్లెట్ ట్రైన్ నడిపిస్తే జిల్లా అభివృద్ధి

**- సామాజిక కార్యకర్త నెమలికొండ వేణుమాధవ్**



**సదాశివపేట, జూన్ 9 (జనంసాక్షి):** ముంబై--హైదరాబాద్ హైస్పీడ్ రైల్ (బుల్లెట్ ట్రైన్) ప్రాజెక్టులో పాత అలైన్మెంట్ లో ప్రతిపాదించిన జహీరాబాద్ హైస్పీడ్ రైల్‌స్టేషన్‌ను కొనసాగించాలని కోరుతూ సంగా రెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రధాని కార్యాలయానికి (పీఎంవో), (ఎన్ హెచ్ ఎస్ ఆర్ సి యల్) అధికారికంగా వినతిపత్రం పంపారు. ఈ మేరకు జూన్ 8న ప్రధానమంత్రి కార్యాలయానికి లేఖ రాసి, జహీరాబాద్ స్టేషన్ కొనసాగింపుతో సంగారెడ్డి జిల్లా సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు. వినతిపత్రంలో జహీరాబాద్ స్టేషన్ కొనసాగితే జిల్లాకు పారిశ్రామిక, వాణిజ్య, విద్యా మరియు సామాజిక-ఆర్థిక రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అలాగే జాతీయ పెట్టుబడి తయారీ మండలి (నిమ్జ్), పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, రవాణా అనుసంధానం మరింత మెరుగుపడ తాయని వివరించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త, నెమలికొండ వేణుమాధవ్ స్పందిస్తూ, జహీరాబాద్ బుల్లెట్ ట్రైన్ స్టేషన్ అంశా న్ని ప్రధానమంత్రి కార్యాలయం దృష్టికి తీసుకెళ్లిన సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలి పారు. ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ జిల్లా అభివృద్ధి కోసం ఎమ్మెల్యే చేసిన ఈ ప్రయత్నం అభినందనీయమని అన్నారు. జిల్లా ప్రజల తరఫున ఈ అంశంపై స్పందించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు మరోసారి కృతజ్ఞత లు తెలుపుతూ, కేంద్ర ప్రభుత్వం జహీరాబాద్ స్టేషన్‌ను తుది ప్రణాళిక లో కొనసాగించాలని వేణుమాధవ్ విజ్ఞప్తి చేశారు.

# హలాల్‌పై నిషేధం విధించాల్సిందే.. జట్కా పద్ధతిపై తేల్చిచెప్పిన నేతలు



**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 9 (జనంసాక్షి):** భారతదేశంలో హలాల్ మాంసాన్ని నిషేధించి, జట్కా పద్ధతిని ప్రవేశపెట్టాలనే డిమాండ్ గత కొంతకాలంగా వివిధ రాష్ట్రాల్లో విస్తృతం గా చర్చల్లో ఉంది. ముఖ్యంగా హిందూ సంస్థలు, పలువురు రాజకీయ నాయకు లు ఈ అంశంపై ప్రకటనలు చేస్తున్నా నేపథ్యం లో స్థానిక జములమ్మ దేవాలయ పరిసరాలలో హలాల్ నిషేధించి జట్కా పద్ధతి ప్రవేశపెట్టాలి అని విశ్వహిందూ పరిషత్ - బజరంగ్ దళ్ డిమాండ్ చేస్తున్నాయి. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని శ్రీ జములమ్మ దేవాలయంలో జంతు బలుల విషయంలో హలాల్ విధానాన్ని నిషేధించి, సంప్రదాయ జట్కా పద్ధతిని అమలు చేయాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు మంగళవారం దేవాలయ ఈవో పురేందర్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భం గా నాయకులు మాట్లాడుతూ, గ్రామదేవతల ఆరాధనలో భాగంగా అనాదిగా కొనసాగుతున్న హిందూ సంప్రదాయాలను పరిరక్షించడం అవసరమని పేర్కొన్నారు. జములమ్మ అమ్మవారి ఆలయ పరిధిలో జరిగే జంతు బలులు హిందూ ఆచార వ్యవ హారాలకు అనుగుణంగా సంప్రదాయ జట్కా పద్ధతిలోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**హలాల్ :** ఇది ముస్లిం సంప్రదాయ పద్ధతి. ఇందులో జంతువు ప్రాణంతో ఉన్నప్పుడు గొంతు వద్ద ప్రధాన రక్తనాళాలను కోసి, రక్తం పూర్తిగా కారిపోయేలా చేస్తారు. **జట్కా :** ఇది హిందూ, సిక్కు సంప్రదాయ పద్ధతి. ఇందులో జంతువుకు ఎక్కువ బాధ తెలియ కుండా, ఒకే దెబ్బతో (శిరచ్ఛేదం) తక్షణమే ప్రాణం తీస్తారు. అలాగే భక్తుల మనోభావాలు, దేవాలయ సంప్రదాయాలు మరియు స్థానిక ఆచారాలను గౌరవిస్తూ ఆలయ పరిసరాలలో హలాల్ విధానాన్ని అనుమతించకుండా తగినచర్యలు చేపట్టాలని ఈవోకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సి. ప్రవీణ్ కుమార్, బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ తిరుపతి మణి, కౌన్సిలర్ చంద్రశేఖర్, గాద్దే మోహన్, వెంకటేష్,మనోజ్, శ్రీకాంత్, తిరుమలేష్ ,భాస్కర్, రాజు, పవన్ తదితర విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పుట్టపాగ మహేంద్రనాథ్ శత జయంతి ఉత్సవాలు

**- జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ భవనంలో ఉత్సవాలు**



**నాగర్ కర్నూల్, జూన్ 9 (జనంసాక్షి):** నాగర్ కర్నూల్ మాజీ మంత్రి పుట్టపాగ మహేంద్రనాథ్ శత జయంతి ఉత్సవాలను నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో జూన్ 10వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పుట్టపాగ మహేంద్రనాథ్ శత జయంతి ఉత్సవాల కమిటీ కన్వీనర్ పుట్టపాగ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర పర్యాటక సంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు , పార్ల మెంట్ సభ్యుడు మల్లు రవి, ఎమ్మెల్సీ కుచుకుల దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి. హాజరవు తారని శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్ర మానికి. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ సి.ఖాసీమ్ అధ్యక్షత వహిస్తారు. ఈ శతాబ్ది ఉత్సవాలకు మేధావులు, రాజ కీయ నాయకులు, ప్రజలు. అయన అభి మానులు అధికసంఖ్యలో పాల్గొని మహేం దర్ నాథ్ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

# మహిళల ఆర్థిక సాధికారతకు రేవంత్ రెడ్డి ప్రాధాన్యం

**- ఆకునూరు సర్పంచ్ కొమ్ము రవి**

**చేర్యాల జూన్ 09 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో మహిళల ఆర్థిక సాధికారతకు రేవంత్ రెడ్డి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షుడు, ఆకునూరు గ్రామ సర్పంచ్ కొమ్ము రవి అన్నారు. మహిళా వారోత్సవాలు, ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా శక్తి పథకం- మహిళా సంఘాల యాజమాన్యంలోని 553 బస్సుల నిర్వహణను టీజీఎస్ఆర్ టీసీకి అప్పగించే కార్యక్రమంలో మహిళా సంఘాలతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో మహిళల ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న "ఇందిరా మహిళా శక్తి" కార్యక్రమం మరో కీలక దశలోకి అడుగు పెట్టిందని అన్నారు. మహిళా స్వయం సహా యక సంఘాలను కేవలం పొదుపు సమా ఖ్యలుగానే కాకుండా వ్యాపార భాగస్వామ్యు లుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రారంభించిన ఆర్టీసీ అద్దె బస్సుల పథకం విజయవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో రెండో విడతను ప్రభుత్వం ప్రారంభిస్తోందని తెలిపారు. మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





# అరకకు భలే డిమాండ్

**- ఒక్క రోజుకు రూ.2 వేలు**

**- గ్రామాల్లో ఎడ్ల కొరత**



**రాజోలి, జూన్ 9 (జనంసాక్షి):** వ్యవసాయంలో ఆధునిక యంత్రాల వినియోగం పెరగడంతో కాడెద్దుల ప్రాధాన్యం క్రమంగా తగ్గిపోతోంది. ఒకప్పుడు ప్రతి రైతు ఇంట్లో కనిపించే కాడెద్దులు ఇప్పుడు అరుదుగా మారాయి. అయితే పత్తి, వేరుశనగ, కంది వంటి పంటల సాగులో అరక అవసరం ఉండటంతో ప్రస్తుతం అరకకు మంచి డిమాండ్ నెలకొంది. ట్రాక్టర్లు వ్యవసాయ పనులను వేగంగా పూర్తి చేస్తున్నప్పటికీ, పంటల్లో కలుపు నివారణతో పాటు భూమిలో తేమ నిల్వ ఉండేందుకు అరకతో దున్నడం రైతులకు ఉపయోగకరంగా మారింది. దీంతో కాడెద్దులు, అరక కలిగి ఉన్న రైతులను ముందుగానే సంప్రదించి అడ్వాన్సులు చెల్లించి బుక్ చేసుకుంటున్నారు. గతంలో గ్రామాల్లో రైతులు పరస్పరం సహకరించుకుని విత్తనాలు వేసుకునేవారు. ప్రస్తుతం వర్షాలు కురిసిన వెంటనే భూమిలోని తేమ తగ్గిపోతుందనే ఆందోళనతో ప్రతి రైతు తన పొలంలో పనులను త్వరగా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో అరక ఉన్న వారి వద్ద పనుల ఒత్తిడి పెరిగింది. ప్రస్తుతం అరకతో కూడిన కాడెద్దుల జతకు రోజుకు రూ.2 వేల వరకు కూలి లభిస్తోంది. విత్తనాల విత్తకం సమయంలో కూడా అరకకు మంచి గిరాకీ ఉంది. ట్రాక్టర్లు ఉన్న రైతులు సైతం పత్తి పంటలో అరక సేవలపై ఆధారపడాల్సి వస్తోంది. మరోవైపు పశువుల మేత కొరత, సంరక్షణ వ్యయం పెరగడం, వ్యవసాయంలో యంత్రాల వినియోగం అధికమవడంతో రైతులు కాడెద్దులను పోషించడం తగ్గించారు. దీంతో గ్రామాల్లో కాడెద్దుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. అయినప్పటికీ అరకతో చేసే సాగు పంటలకు ప్రయోజనకరంగా ఉండటంతో రైతులు ఇప్పటికీ అరక కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

# మాదాసి కురువలు ఎస్సీలు కాదు

**ఇటిక్యాల, జూన్ 9(జనంసాక్షి):** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో మాదాసి, మా దారి కురువ కులానికి చెందిన వ్యక్తులు ఎవరూ లేరని అంబేద్కర్ అసోసియేషన్ ఇటిక్యాల మండల అధ్య క్షుడు ప్రవీణ్ అన్నారు. మాదాసి, మాదారిలు ఎస్సీలుగా కుల ధృవీకరణ పత్రం పొందేందుకు అర్హులు కాదని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇటికెల తహశీల్దార్ శ్రీకాంత్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. వారికి ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వరాదని బీసీబి సర్టిఫికెట్ మాత్రమే ఇవ్వాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సెన్సార్లు వారిని ఎస్సీలుగా గుర్తించకుండా బీసీ బీలుగా గుర్తించాలని, ఇప్పటివరకు ఎస్సీ సర్టిఫికెట్ పొందిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# ఇందిరమ్మ పాలనలోనే మహిళా సాధికారత సాధ్యం

**- సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్**



**వెల్దండ, మే 09 (జనంసాక్షి):** మహిళా సాధికారతే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసిందని సర్పంచ్ మట్ట యాదమ్మకు వెంకటయ్య గౌడ్ అన్నారు. ప్రతిష్ఠాత్మకంగా తెచ్చిన ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా వెల్దండ మండల కేంద్రం నుంచి మంగళవారం మహిళా సంఘాల లు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో 553 బస్సులను మహిళా సంఘాలకు ముఖ్యమంత్రి రేవంత్ చేతుల మీదుగా పంపిణీ చేసే కార్యక్ర మానికి బయలు దేరారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.దేశంలోనే మహిళా బస్సుల పథకం అతిపెద్ద స్థాయిలో అమలవుతున్నట్లు చెప్పారు. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాల్లో భాగంగా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని... అందులో భాగంగా వడ్డీ లేని రుణాలు, స్త్రీ నిధి, క్యాంటీన్లు, పెట్రోల్ బంకులతో మహిళలకు చేయూతను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తాలూకా కిసాన్ సెల్ అధ్యక్షుడు పర్వత్ రెడ్డి , కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరికిషన్ నాయక్, మాజీ మండల అధ్యక్షుడు మోతీలాల్ నాయక్ , కూన పాండు, మహిళా సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

# వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**- ఉర్కొండ ఎస్సై రమాదేవి**



**ఉర్కొండ, జూన్ 09, (జనంసాక్షి);** వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియం త్రణ కోసం మండలంలోని జాతీయ రహదారిపై ఎస్సై రమాదేవి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు.. సందర్భంగా ఎస్సై రమాదేవి మాట్లాడుతూ వాహనదారునికి సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ,ఇన్సూరెన్స్, మరియు పొల్యూషన్ సర్టిఫికేట్ వంటి పత్రాలను కలిగి ఉండాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని,కార్లలో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచిస్తారు.పరిమితికి మించి సరుకులను లేదా ఎక్కువ మంది ప్రయాణికులను ఆటోలు, లారీలలో తరలిస్తే చర్యలు తీసుకుంటారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని బ్రీత్ అనలైజర్ల ద్వారా గుర్తించి కేసులు నమోదు చేస్తా మని సరైన పత్రాలు లేకపోవడం లేదా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని తెలియజేశారు.

# విమర్శలు మాని హామీలు నెరవేర్చాలి

**- కిషన్ రెడ్డిని విమర్శించే అర్హత రేవంత్‌కు లేదు**

**- బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ**



**నారాయణపేట జూన్ 9 (జనంసాక్షి):** హిట్లర్ మనస్తత్వం గల కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభివృద్ధికి కృషి చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని విమర్శించే అర్హత లేదని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ అన్నారు.ఇచ్చిన హామీలు అమలు చేయలేక బిజెపి పై,కిషన్ రెడ్డిపై అనవసర విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో తెలంగాణ అభివృద్ధికి పెద్దపీట వేసిందని అందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృషని అన్నారు.ఆత్మనీర్భ భారత్ కింద పల్లెల ప్రగతికి గ్రామ పంచాయతీ లకు నేరుగా నిధులు అందిం చేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించిందని అన్నారు.ఎస్ టి పి కింద మురుగునీటి శుద్ధి కోసం 3వేల 975 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు.అలాగే 2 టైర్ నగరాల అభివృద్ధికి 1,420 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ట్రైబల్ ఆర్ ఉత్తర భాగానికి కేంద్రం పచ్చ జెండా ఊపిందని 161 కిలో మీటర్ల 6 లైన్లు రోడ్డుకు టెండర్లు పిలిచిందని తెలిపారు.అలాగే హైదరాబా ద్ మెట్రో ఫేజ్ 2 కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని నిర్మాణ వ్యయంలో 50 శాతం కేంద్రం భరిస్తుందని కేంద్రం ప్రకటిం చిందని అన్నారు.తెలంగాం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నా రు.ఎన్నికల్లో ఎలాంటి హామీ లు ఇవ్వక పోయినా తెలంగా ణ అభివృద్ధికి కేంద్రం కృషి చేస్తోందని అన్నారు.ఇకనైనా విమర్శలు మాని హామీలు నెరవేర్చి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని హితవు పలికారు

# ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్ట్‌లకు దరఖాస్తులు చేసుకోండి

**- మండల విద్యాధికారి సి. శ్రీనివాస్ రెడ్డి**

**తెలకపల్లి, జూన్ 09,(జనంసాక్షి):** ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణ కోసం మండల పరిధిలోని గౌరారం గ్రామంలోని యూపీఎస్ ,గట్టురావిపాకుల గ్రామంలోని పీఎస్ ఆలేరు గ్రామంలోని పీఎస్, పెద్దపల్లి పాఠశాలలకు ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వాణ కోసం మంజూరు మంజూరు చేయబడ్డాయి కాబట్టి ఈ తరగతుల నిర్వాహణకు ఆయా పాఠశాలల్లో ఒక ఇన్స్ట్రక్టరు ఒక ఆయా పోస్టుకు దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాధికారి సి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఇన్ స్ట్రక్టర్ కి నెలకు 8000 రూపాయలు, ఆయాకు 6000 రూపాయలు గౌరవ వేతనంగా 10 నెలలకు చెల్లించబడుతుందని అర్హతలు కనీస అర్హత ఇంటర్ , అదనంగా ప్రీ ప్రైమరీ డీఎడ్ వారికి ప్రాధాన్యత ఇవ్వబడనున్నట్లు వారు తెలిపారు. ఆయా పోస్టుకు కనీస అర్హత ఏడవ తరగతి పై రెండు పోస్టులకు అదే గ్రామాలకు చెందిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు.అట్టి అభ్యర్థులు లేనియెడల మండలానికి చెందిన అభ్యర్థులను పరిగణలోకి తీసుకోనున్నట్లు వారు తెలిపారు. పై పోస్టులకు వయసు 18-44 సం.లు, రోస్టర్ పద్ధతి పాటించబడునని అన్నారు. జిల్లా స్థాయిలో ఎంపిక జరుగుతుందని ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 15వ తేదీ లోపు సాయంత్రం ఐదు గంటల లోపు తెలకపల్లి ఎమ్మార్సీ కార్యాలయం నందు దరఖాస్తులను సంబంధిత సర్టిఫికెట్లతో జతపరిచి సమర్పించగలరు. దరఖాస్తు ఫారాన్ని (సవశీ ఋస్త్రుతీఎబతీఅశీశీశ్రీ.షవవఎశ్రీఎ.ఇశీఎ) లేదా మండల విద్యాధికారి కార్యాలయం నందు పొందగలరని తెలిపారు.

# అంతర్జాతీయస్థాయి పరిజ్ఞానాన్ని అందిస్తాయి

**- 10 నుండి 13 వరకు బివిఆర్ఐటిలో సదస్సు**



**నర్సాపూర్ జూన్ 9 (జనంసాక్షి):** ప్రపంచ ప్రఖ్యాత యాంటెన్నా, వైర్లెస్ కమ్యూనికేషన్ అంతర్జాతీయస్థాయి పరిజ్ఞానాన్ని అందిస్తాయని బి.వి. ఆర్.ఐ.టి ప్రిన్సిపల్ డా. సంజయ్ దూబే వెల్లడించారు. నర్సాపూర్ పట్టణ సమీపంలోని బి వి ఆర్ ఐ టి లో అంతర్జాతీయ స్థాయి 5వ ఐఈఈఈ వైర్లెస్, యాంటెన్నాస్ ఒ మైక్రోవేవ్ సింపోజియం (వామ్స్ 2026) సదస్సు మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ వర్క్ షాప్‌లో ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ సి.జె.రెడ్డి, అధ్యక్షులు, ఐఈఈఈ యాంటెన్నా మరియు ప్రసరణ సంఘం, అమెరికా ప్రొఫెసర్ క్రిస్టోఫ్ ఫ్యూమాక్స్, మాజీ అధ్యక్షులు, ఐఈఈఈ యాంటెన్నా, ప్రసరణ సంఘం, ఆస్ట్రేలియా తదితరులు హాజరయ్యారు. అనంతరం సంస్థ డైరెక్టర్ డా. కె.లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం విద్యార్థులు, అధ్యాపకులు, యువ ఇంజినీర్లు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి, అంతర్జాతీయ నిపుణులతో మమేక మయ్యే అరుదైన అవకాశాన్ని కల్పిస్తోంది అని పేర్కొన్నారు. ప్రధాన సదస్సు వామ్స్ 2026 జూన్ 10 నుండి 13 వరకు నిర్వహించబడు తుందని, ఈ సదస్సుకు దేశ విదేశాల నుండి పరిశోధకులు, అధ్యాప కులు, పరిశ్రమ నిపుణులు మరియు విద్యార్థుల హాజరుకానున్నారనీ తెలిపారు.

ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, డీన్లు, ఎలక్ట్రానిక్స్ , కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల మేనేజర్ బాపిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెబ్బేరు యువకుడికి అరుదైన ఘనత

**- మెదక్ ఫాల్కన్స్ హెడ్ కోచ్‌గా కె.జగదీష్ రెడ్డి**




**పెబ్బేరు జూన్ 9 (జనంసాక్షి):** వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం కంచిరావుపల్లి గ్రామానికి చెందిన కె. జగదీష్ రెడ్డి అరుదైన ఘనత సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ICC లెవల్-3 కోచ్ అయిన తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ బడుతున్న ం+20 లీగ్ ఫ్రాంచైజీ మెదక్ ఫాల్కన్స్ జట్టుకు హెడ్ కోచ్‌గా నియమితులయ్యారు. కె. నరసింహా రెడ్డి కుమారుడైన జగదీశ్వర్ రెడ్డి, కంచిరావుపల్లి గ్రామం నుంచి తన ప్రయాణాన్ని ప్రారంభించి క్రమ శిక్షణ, అంకితభావం, కఠోర శ్రమతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో కోచ్‌గా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇప్పుడు స్టార్ ఆటగాళ్లతో కూడిన మెదక్ ఫాల్కన్స్ జట్టుకు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టడం వనపర్తి జిల్లా ప్రజలకు గర్వకారణంగా నిలిచింది. ఇటీవల నిర్వహించిన TG20 ఆటగాళ్ల వేలంలో భారత జట్టు స్టార్ క్రికెటర్ తిలక్ వర్మను మెదక్ ఫాల్కన్స్ జట్టు రూ.33 లక్షల రికార్డు ధరకు కొనుగోలు చేసింది. TG20 లీగ్ చరిత్రలోనే అత్యధిక ధరకు అమ్ము డైన ఆటగాడిగా తిలక్‌వర్మ నిలిచారు. అలాగే ప్రముఖ క్రికెటర్ రవితేజ కూడా ఈ జట్టులో చోటు దక్కించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల యువత కూడా సరైన లక్ష్యం, పట్టుదలతో కృషి చేస్తే అంతర్జాతీయ స్థాయికి చేరుకోవచ్చని జగదీష్ రెడ్డి తన విజయాలతో నిరూపిస్తున్నా రని క్రీడా వర్గాలు పేర్కొంటున్నాయి. ఆయన సాధించారు.

ఈ సందర్భంగా పెబ్బేరు ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణకుమార్ రెడ్డి, క్రికెట్ అకాడమీ కోచ్ శంకర్, ఫుట్‌బాల్ కోచ్ నాగరాజు, సాయికుమార్, గోవింద్, కాశి, అసాద్, ఇర్ఫాన్, శ్రీను, రవి తదితరులు కె. జగదీష్ రెడ్డిని అభినందించారు.

వనపర్తి జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయి కోచ్‌గా ఎదిగి, ఇప్పుడు TG20 లీగ్‌లో బలమైన జట్లలో ఒకటైన మెదక్ ఫాల్కన్స్‌కు హెడ్ కోచ్‌గా ఎంపిక కావడం ఆయన ప్రతిభ, కృషి, పట్టుదలకు నిదర్శన మని పలువురు ప్రశంసించారు.

# పరస్పర అంగీకారం ద్వారా పెండింగ్లో ఉన్న కేసులు కొట్టివేత

**- లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి**

**- జిల్లా లీగల్ సర్వీసెస్ కార్యదర్శి వింధ్య నాయక్**



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 9, (జనంసాక్షి):** నారాయణపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ను ఉద్దేశించి సీనియర్ సివిల్ జడ్జి,లీగల్ సర్వీసెస్ కార్యదర్శి వింధ్య నాయక్ మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరిం చడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడు తుందని తెలిపారు. మే 9న జరగాల్సిన లోక్ అదాలత్ ఈనెల 20న జరుగనుంది అన్నారు. తదుపరి నారాయ ణపేట జిల్లాలోని మొత్తం 14 పోలీస్‌స్టేషన్ పరిధిలో పెండింగ్లో ఉన్న కేసులను గురించి ఆరాదీశారు. వాటిని ఈ లోక్ అదాలత్ లో త్వర గా క్లియర్ చేయాలని ఆదేశం చారు.జిల్లాలోని అన్ని పోలీ స్ స్టేషన్లు నారాయణపేట టౌన్ ,రూలర్, మాగనూరు, మద్దూరు, దామరగిద్ద, ఉట్కూర్, కోస్గి, ధన్వాడ, మక్తల్, కృష్ణ, నర్వ, మరియు మరికల్, ఎక్సైజ్ ఇతర స్టేషన్‌లలో ఈపెట్టి. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెండింగ్లో ఉన్నాయని టార్గెట్‌గా ఉన్నాయని తెలిపారు. ఎక్సయిజ్ శాఖలో పెండింగ్ కేసులు ఉన్నాయా క్లియర్ చేయాలన్నారు. అన్ని కలిపి 6500 కేసులను టార్గెట్‌గా అయన నిర్దేశించారు. కార్య క్రమం విజయవంతం చేయడానికి అన్ని టీములు సిద్దంగా ఉండాలని ఈ లోక్ అదాలత్‌ను కక్షిదారులు ఉప యోగించుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు యధావిధిగా కొనసాగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏజెండాలోని అంశా లు యుటిపిఎస్, చార్జిషీట్, సైబర్ క్రైమ్స్ గురించి చర్చించారు, ముందుగా హై కోర్ట్ జడ్జి ఆదేశానుసారం ముందుగా జైలులో ఉన్న ఖైదీల కేసులను డిస్పోసల్ చెయ్యాలని పోలీస్ అధికారులకు ఆదే శించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మనోజ్ కుమార్ మాట్లాడుతూ ఈ జాతీయ లోక్ అదాలత్ లో పోలీసులందరూ సహక రించి జాతీయ లోక్ అదాలత్ ను ఉపయోగించుకొని రాజి మార్గం ద్వారా కేసులని తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి ఆదేశించారు. ఈ సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జ్ అవినాష్ ,డిఫెన్స్ కౌన్సిల్స్ కె లక్ష్మి పతి గౌడ్, పోలీస్ అధికారులు, కోర్ట్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

# గ్రామ సభను విజయవంతం చేద్దాం

**- కార్యదర్శి రవి కుమార్**



**ఖిల్లా ఘనపురం, జూన్ 9, (జనంసాక్షి):** మండల కేంద్రంలోనీ స్థానిక గ్రామ పంచాయతీ భవనంలో నేడు జరగబోయే గ్రామ సభ సమావేశం ను స్థానిక గ్రామస్థులు పెద్దలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చెయ్యాలని కార్యదర్శి రవికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఆయన మాట్లాడుతూ స్థానిక సర్పంచ్ ఆగారం పద్మమ్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామ సభ సమావేశం లో పలు అంశాల పై చర్చ సమావేశ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అందులో భాగంగా 99 రోజుల ప్రజా పాలన ప్రగతి నివేదిక ముగింపు ఉత్సవాలు పంచాయతీరాజ్, రూరల్ డెవలప్మెంట్ అంశాలు, రానున్న వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు చేపట్టవలసిన పనులు అలాగే ,ఎంజి ఎన్ఆర్ఇజి ఎస్. ఎన్. ఎఫ్. బి. ఎస్. రహదారి భద్రత ,మహిళ శిశు సంరక్షణ ,వ్యవసాయం ,బడిబాట , ఓటర్ లిస్టు ఎస్. ఐ. ఆర్ ,ఇందిరమ్మ ఇండ్లు త్రాగునీరు ,పారిశుద్ధ్యం ,వీధిలైట్లు , ఇతర అభివృద్ధి పనులపై సమావేశం ఉంటుంది కావున గ్రామ పెద్దలు మహిళలు యువకులు అన్ని కులసంగల నాయకులు సభ్యులు మాజీ సర్పంచులు వార్డు సభ్యులు అందరూ కూడా ఈ గ్రామ సభ లో పాల్గొని గ్రామ అభివృద్ధి లో తోడ్పాటు అయ్యే సలహాలు సూచనలు ఇవ్వగలరని ఈ సందర్భంగా కార్యదర్శి రవి కుమార్ తెలిపారు.

# సమగ్ర అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషిచేయాలి

- ఇండస్ట్రియల్ హబ్‌గా వెలుగొందుతున్న జిల్లా అభివృద్ధిలో మరింత ముందుకు సాగాలి
- రైతులను క్రాప్ డైవర్షన్, ఆయిల్ పామ్ సాగు వైపు ప్రోత్సహించాలి
- ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి
- గ్రామీణ ప్రాంతాల యువతులను నర్సింగ్ విద్య వైపు ప్రోత్సహించాలి
- ఆసుపత్రుల్లో అవసరమైన వైద్య మౌలిక వసతులు కల్పించాలి
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**సంగారెడ్డి టౌన్, జూన్ 09 (జనంసాక్షి):** జిల్లా సమగ్ర అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర కార్మిక, ఎంప్లాయిమెంట్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి సూచించారు. తాగునీరు, వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, రవాణా, ఆర్ అండ్ బి, పిసిబి, పి ఆర్, విద్యుత్, డి ఆర్ డి ఏ, సంక్షేమ శాఖలు, ఆర్టీసీ, షుగర్ కేన్, పరిశ్రమలు, తదితర రంగాల పురోగతిపై మంగళవారం నిర్వహించిన జిల్లా సమీక్ష సమావేశంలో ఆయా శాఖల అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి దిశానిర్దేశం చేశారు.

**ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ...**




ఇండస్ట్రియల్ హబ్‌గా వేగంగా అభివృద్ధి చెందుతున్న సంగా రెడ్డి జిల్లా మరింత పురోగతి సాధించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో రైతులను క్రాప్ డైవర్షన్ వైపు ప్రోత్సహిస్తూ, లాభదాయక పంట అయిన ఆయిల్ పామ్ సాగుపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖలు




సమన్వయంతో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి ఎలాంటి అక్రమాలు జరగకుండా చూడాలని, రైతులకు యూరియా, డీఏపీ తదితర ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు సరైన సాంకేతిక మార్గదర్శకత్వం అందించి ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లించాలని అన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల పథకం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతోందని, గూడు లేని పేదలకు సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే జిల్లాలో గతంలో నిర్మించి కేటాయించని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడాలని, తాగునీటి సమస్యలు ఎక్కడా తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాల మేరకు నీటి నిల్వలను నిర్వహించాలని చెప్పారు. జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి అవసరమైన మౌలిక వసతులపై నివేదిక సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేయాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రభుత్వం తగిన బడ్జెట్ కేటాయించేందుకు సిద్ధంగా ఉందన్నారు.

జాతీయ రహదారి-65 పరిధిలో ఉన్న విద్యుత్ స్తంభాల మార్పిడి పనులను వేగవంతం చేయాలని, నిర్మాణ కార్మికుల నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు వారికి అందేలా చూడాలని సూచించారు. జిల్లాలోని ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించే దిశగా కార్యాచరణ రూపొందించాలని, అవసరమైన అదనపు బస్సుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు.

హాస్పిటళ్లు, హోటళ్లు తదితర సంస్థల్లో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ నిర్వహించి కాలుష్య నియంత్రణ చర్యలను పటిష్టం చేయాలని ఆదేశించారు.

**ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ...**

ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న సేవలు ప్రత్యక్షంగా చేరడం ముఖ్యమని అన్నారు.



తాగునీటి సమస్యలు ఉన్న ప్రాంతాల్లో అవసరమైన బోర్‌వెల్స్ కోసం వెంటనే ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన అన్ని డయాగ్నస్టిక్ పరికరాలు, డ్రగ్స్, అవసరమైన ఇక్విప్‌మెంట్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, డయాలసిస్ సేవలకు అవసరమైన చోట అదనపు పడకల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో నర్సింగ్ కళాశాలను ఈ నెలాఖరులోగా ప్రారంభించనున్నట్లు తెలిపారు.

నర్సింగ్ వృత్తికి ప్రస్తుతం దేశవ్యాప్తంగా, అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉన్నందున గ్రామీణ ప్రాంతాల యువతులను నర్సింగ్ కోర్సులు అభ్యసించేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి 35 కిలోమీటర్ల పరిధిలో ఒక ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అంబులెన్స్ సేవలను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన డ్రైవర్ల నియామకాల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణ పనులను వేగవంతం చేసి వచ్చే విద్యా సంవత్సరంలోపు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎంపీలు, ఎమ్మెల్సీ, శాసనసభ్యులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీ సురేష్ శేట్కార్ రైతు సమస్యలను పార్టీలకతీతంగా పరిష్కరించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రైతులకు న్యాయం చేయాలన్నారు.

ఎంపీ రఘునందన్ రావు ప్రజలు మోసపోకుండా ఏ సర్వే నంబర్లు ఏ భూమి ఉందో తెలిసేలా వెబ్సైట్లో పెట్టాలన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణ పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపీలు రఘునందన్ రావు, సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, సునీతా లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, సెట్విన్ ఛైర్మన్ గిరిధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రీని వేగవంతం చేయాలి

- రైతుల శ్రేయస్సుకు చిత్తశుద్ధితో పనిచేయాలి
- నకిలీ విత్తనాలు అమ్మే డీలర్లపై కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ,జూన్ 9 (జనంసాక్షి);** రైతుల శ్రేయస్సుకు పెస్టిసైడ్స్ డీలర్లు కట్టుబడి ఉండాలని, వ్యవసాయశాఖ అధికారులు ఫార్మర్ రిజిస్ట్రీని వేగవంతం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.

మంగళవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో జిల్లాలోని పెస్టిసైడ్ దుకాణాల డీలర్లు, సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని, డీలర్లు, అధికారుల కారణంగా రైతులకు ఏ చిన్న సమస్య వచ్చినా సహించేది లేదన్నారు. ఫెయిల్ అయిన, విడిగా ఉండే, గడువు ముగిసిన విత్తనాలను విక్రయించకూడదన్నారు. ప్రతి పెస్టిసైడ్ దుకాణాల వద్ద సంబంధిత డీలర్లు స్టాక్, ధరల పట్టిక, తదితర వివరాలను విధిగా ప్రదర్శించాలన్నారు. విత్తనాలు, ఎరువులు అమ్మేందుకు కొత్తగా లైసెన్సు తీసుకునేవారు, రెన్యువల్ చేసుకోవాల్సిన డీలర్లు నిబంధనలను పాటించాలన్నారు. యూరియా కొరత, కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరిగినందున అన్నదాతలు నానో యూరియాపై దృష్టి సారించేలా సహకరించాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు తరచూ పెస్టిసైడ్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలు పాటించని సంబంధిత దుకాణాల డీలర్లపై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. ఫార్మర్ రిజిస్ట్రీలో జోగులాంబ గద్వాల జిల్లా ప్రస్తుతం 68 శాతంతో రాష్ట్రంలో 28వ స్థానంలో ఉందని, వంద శాతం పూర్తి చేసేందుకు ఏఈవోలు నిబద్ధతతో పని చేయాలన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారులు కూడా ప్రత్యేక చొరవ తీసుకొని



ఫార్మర్ రిజిస్ట్రీ వేగవంతం అయ్యేందుకు రెండు రోజులకోసారి తమ పరిధిలోని ఏఈవోలపై పర్యవేక్షణ చేస్తుండాలన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని అన్నారు. పిఎండిడికేవైకు జోగులాంబ గద్వాల జిల్లా ఎంపికవడంతో వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో రైతులు సాంకేతికతను వినియోగిస్తూ ఆర్థికంగా ఎదిగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, అదనపు ఎస్పీ శంకర్, ఆత్మ డిప్యూటీ పిడి జగ్గు నాయక్, ఆయా మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏనుగండ్లలో పేకాట స్థావరంపై దాడి

- ఏడుగురు పట్టివేత - రూ.15,100 నగదు స్వాధీనం
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు



**కొల్చారం, జూన్ 9, (జనంసాక్షి):** మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఆదేశాల మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూల్చారం మండలంలోని ఏనుగండ్ల గ్రామంలో పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు. మన్నే కిష్టయ్య కిరాణా షాప్ వెనుక భాగంలో కొందరు పేకాట ఆడుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పట్టుకుని, వారివద్ద నుంచి రూ.15,100 నగదుతో పాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చర్యల నిమిత్తం కూల్చారం పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, మాట్లాడుతూ, జిల్లాలో పేకాట, జూదం, మాదకద్రవ్యాల రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు.

ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో జరిగే చట్టవిరుద్ధ కార్యకలాపాల గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేసి పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు.